
సిద్దిపేట అర్బన్: సిద్దిపేట మల్టీపర్పస్ ఉన్నత పాఠశాలలో పరిశీలిస్తున్న కలెక్టర్ మనుచౌదరి


గజ్వేల్: పరీక్షా కేంద్రాన్ని సందర్శించిన గజ్వేల్ ఏసీపీ పురుషోత్తంరెడ్డి


కొమురవెల్లి: హాల్‌టికెట్ నెంబర్ చూసుకుంటున్న విద్యార్థులు

# 11 మంది గైర్హాజరు

## పదో తరగతి పరీక్షలు షురూ.. 13,973 మంది విద్యార్థులు హాజరు

- పలు పరీక్షా కేంద్రాలను పరిశీలించిన కలెక్టర్ మనుచౌదరి
- సజావుగా ముగిసిన తొలిరోజు పరీక్ష

సిద్దిపేట అర్బన్, మార్చి 18: జిల్లావ్యాప్తంగా టెన్త్ పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా తొలిరోజు పరీక్షలు సజావుగా ముగిశాయి. తొలిరోజు పరీక్షకు 99.92 శాతం మంది విద్యార్థులు హాజరైనట్లు అధికారులు వెల్లడించారు. మొత్తం జిల్లావ్యాప్తంగా ఏర్పాటు చేసిన 80 పరీక్షా కేంద్రాల్లో 13,984 మంది విద్యార్థులకు 13,973 మంది హాజరు కాగా 11 మంది గైర్హాజరయ్యారు. నలుగురు ప్రైవేట్ విద్యార్థులకు నలుగురు హాజరయ్యారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఒక నిమిషం నిబంధన అమలు లేనప్పటికీ.. విద్యార్థులు సమయం కంటే ముందుగానే పరీక్షా కేంద్రాలకు చేరుకున్నారు. జిల్లాలోని అన్ని పరీక్షా కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి వాటి పర్యవేక్షణలోనే క్వశ్చన్ పేపర్ రిలీజ్ చేసి జవాబు పత్రాలను సీజ్ చేశారు. ప్రతి పరీక్షా కేంద్రం వద్ద 144 సెక్షన్ అమలు చేయడంతో పాటు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. జిల్లా ఉన్నతాధికారులు పలు పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసి పరీక్షల నిర్వహణను పరిశీలించారు.

**పరీక్షా కేంద్రాలను పరిశీలించిన కలెక్టర్**

సిద్దిపేట జిల్లా కేంద్రంలోని మల్టీపర్పస్ హైస్కూల్, ఇందిరానగర్ జిల్లా పరిషత్ హైస్కూల్‌లో టెన్త్ పరీక్షా కేంద్రాలను కలెక్టర్ మను చౌదరి ఆకస్మికంగా తనిఖీ చేసి పరీక్ష జరుగుతున్న తీరును, పరీక్షా కేంద్రాల్లో ఏర్పాటు చేసిన వసతులు, బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించారు. ఎలాంటి మాస్ కాపీయింగ్ జరుగకుండా కట్టుదిట్టంగా పరీక్షలు నిర్వహించాలని పరీక్షా కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్లను ఆదేశించారు. విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా పరీక్షలు నిర్వహించాలని, ప్రశ్నాపత్రాలు, జవాబు పత్రాల రవాణా పోలీస్ ఎస్కార్ట్‌తో నిర్వహించాలన్నారు. తాగునీరు, మరుగుదొడ్ల సౌకర్యం తప్పకుండా ఉండాలని, ఓఆర్‌ఎస్ ప్యాకెట్లతో పాటు అవసరమైన మెడిసిన్‌తో వైద్య శిబిరం తప్పక అందుబాటులో ఉండాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

### ఇష్టారాజ్యంగా ఇన్విజిలేటర్ల నియామకం

చేర్యాల, మార్చి 18: టెన్త్ వార్షిక పరీక్ష నిర్వహణ కోసం నియమించే ఇన్విజిలేటర్ల నియామకంలో సంబంధిత శాఖ అధికారులు నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. జూనియర్ ఉపాధ్యాయులను డిపార్ట్‌మెంటల్ అధికారులుగా, సీనియర్లను డిపార్ట్‌మెంట్ అధికారుల కింద ఇన్విజిలేటర్లుగా నియమించడంతో పలువురు ఉపాధ్యాయులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ఒకే మండలంలో పనిచేస్తున్న ఉపాధ్యాయులను అదే మండలంలో ఇన్విజిలేటర్‌గా నియమించాల్సి ఉండగా దాన్ని సైతం జిల్లా, మండల విద్యాశాఖ అధికారులు పట్టించుకోలేదు. చేర్యాల మండలంలో పనిచేస్తున్న వారిని మద్దూరు, కొమురవెల్లి, ధూళిమిట్ట మండలాల్లో ఇన్విజిలేటర్లుగా నియమించారు. మద్దూరు, ధూళిమిట్ట మండలాల్లో పని చేస్తున్న వారిని చేర్యాల, కొమురవెల్లి మండల కేంద్రాల్లోని పరీక్షా కేంద్రాల్లో ఇన్విజిలేటర్లు, అధికారులుగా నియమించడంపై అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. సంబంధిత శాఖ ఉన్నతాధికారులు పరీక్షల నిర్వహణ కోసం నియమించిన డిపార్ట్‌మెంటల్ అధికారులు, ఇన్విజిలేటర్లపై విచారణ జరిపించాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.


నారాయణరావుపేట: గుర్రాలగొంది పరీక్షా కేంద్రంలో...


వర్గల్: నెంటూర్ పరీక్షా కేంద్రం వద్ద విద్యార్థులను తనిఖీ చేస్తున్న పోలీస్ సిబ్బంది


కొండపాక(కుకునూరుపల్లి): దుద్దెడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో...

## త్వరలో అందుబాటులోకి 24 గంటల వైద్యం

నారాయణరావుపేట, మార్చి 18: మండల కేంద్రమైన నారాయణరావుపేటలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్యాధికారి శ్రీనివాస్ సోమవారం సందర్శించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎక్కడైతే ఉద్యోగరీత్యా ప్రస్తానవ మొదలుపెట్టానో అదే జిల్లా అధికారిగా దవాఖానను సందర్శించడం సంతోషంగా ఉందన్నారు. నారాయణరావుపేట పీహెచ్‌సీలో త్వరలోనే 24 గంటల వైద్యసేవలు అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. వైద్యాధికారులు రోగులకు అందుబాటులో ఉండి వైద్య సేవలు అందజేయాలని ఆయన సూచించారు. వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.


నారాయణరావుపేట: వైద్యాధికారులతో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో శ్రీనివాస్

**జిల్లా వైద్యాధికారిని కలిసిన ఆర్‌ఎంపీలు**

సిద్దిపేట టౌన్, మార్చి 18: జిల్లా వైద్యాధికారిగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన పుట్ల శ్రీనివాస్‌ను తెలంగాణ ఆర్‌ఎంపీ, పీఎంపీల వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి బాల్‌రాజ్, జిల్లా అధ్యక్షుడు వైకుంఠం, పట్టణ అధ్యక్షుడు ముదిగొండ శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు కుమారస్వామి సోమవారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

**డీఎంహెచ్‌వోను కలిసిన నేతలు**

సిద్దిపేట, మార్చి 18: నూతనంగా బాధ్యతలు చేపట్టిన జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి డాక్టర్ పుట్ల శ్రీనివాస్‌ను తెలంగాణ మెడికల్ అండ్ పబ్లిక్ హెల్త్ ఎంప్లాయిస్ హెచ్1 యూనియన్ జిల్లా అధ్యక్షుడు మహ్మద్ జాకీర్ హుస్సేన్, వర్కింగ్ ప్రెసిడెంట్ గాలి రమేశ్ ఆధ్వర్యంలో సోమవారం కలిశారు. కార్యక్రమంలో ఇక్కడ పనిచేసిన డీఎంహెచ్‌వో డాక్టర్ కాశీనాథ్, యూనియన్ జిల్లా కార్యదర్శి మహేందర్‌గౌడ్, ఉపాధ్యక్షుడు నక్క రాములు, మహిళా సంఘం నాయకురాలు సామ్రాజ్యం, గాలేమ్మ, లింగం, భాస్కర్, మల్లేశం, ఆప్తాల్మిక్ ఆఫీసర్లు శ్రీనివాస్, భద్రయ్య, తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.



హుస్నాబాద్‌లోని ప్రభుత్వ దవాఖాన ప్రహరీపై కనిపిస్తున్న రాతలు

## కోడ్‌కూసినా తొలగని రాతలు

హుస్నాబాద్‌టౌన్, మార్చి 18: పార్లమెంట్ ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినప్పటికీ ప్రభుత్వ భవనాలపై రాజకీయ పార్టీల ఎన్నికల రాతలు మాత్రం అధికారులు తొలిగించలేదు. స్థానిక ప్రభుత్వ దవాఖాన ప్రహరీకి బీజేపీతో పాటు పలు పార్టీల ఎన్నికల ప్రచారానికి సంబంధించిన రాతలు కనిపిస్తున్నాయి. రాజకీయ పార్టీల ఎన్నికల ప్రచారానికి సంబంధించిన రాతలను అధికారులు తొలిగించాల్సి ఉంది. కానీ ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చి రెండు రోజులు గడుస్తున్నా రాజకీయ పార్టీల ఎన్నికల నినాదాలు ప్రభుత్వ భవనాలపై నేటికీ దర్శనమిస్తున్నాయి.

## పురుగుల మందు తాగి యువకుడి ఆత్మహత్య

మద్దూరు(ధూళిమిట్ట), మార్చి18: పురుగుల మందు తాగి యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన కూటిగల్‌లో చోటుచేసుకుంది. ఎస్సై షేక్ యూనూస్ అహ్మద్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన తిగుళ్ల రమేశ్(21) అనే యువకుడు హనుమకొండలోని కాకతీయ డిగ్రీ కళాశాలలో డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతూ ఆర్మీ ఉద్యోగం కోసం ఉచిత శిక్షణకు వెళ్లాడు. మెడికల్ చెకప్‌లో రమేశ్ చేతులు వంకరగా ఉన్నాయని అతన్ని అధికారులు రిజక్ట్ చేశారు. దీంతో భవిష్యత్‌లో తాను ఆర్మీ ఉద్యోగం పొందలేనని మనస్తాపానికి గురై ఈనెల 16న తన వ్యవసాయ బావి వద్ద పురుగుల మందు తాగాడు. అపస్మారక స్థితిలో ఉన్న అతన్ని సిద్దిపేట సర్కారు దవాఖానకు తరలించగా చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు. మృతుడి తండ్రి బాలయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## రైస్‌మిల్లుల్లో తనిఖీలు

హుస్నాబాద్, మార్చి 18: హుస్నాబాద్ పట్టణ శివారులోని పవనసుత పారాబాయిల్డ్ రైస్ మిల్లులో సోమవారం సివిల్ సప్లయ్ విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఆకస్మిక తనిఖీలు చేశారు. మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు తనిఖీలు కొనసాగాయి. హైదరాబాద్‌కు చెందిన ఎస్పీ స్థాయి అధికారుల ఆధ్వర్యంలో తనిఖీలు జరిగినట్లు సమాచారం. రికార్డులో ఉన్న విధంగా మిల్లులో నిల్వలు ఉన్నాయా లేదా అనే అంశంపై విచారణ జరిపారు. సివిల్ సప్లయ్ ద్వారా కొనుగోలు చేసిన ధాన్యం నిల్వలు రికార్డులో ఉన్నంతగా లేవనే ఫిర్యాదుతో తనిఖీలు చేసినట్లు తెలిసింది. పూర్తి వివరాలను త్వరలోనే వెల్లడిస్తామని సంబంధిత అధికారి ఒకరు తెలిపారు. కాగా ప్రస్తుతం అధికారులు తనిఖీ చేస్తున్న మిల్లుతో పాటు మిగతా మిల్లుల్లో ధాన్యం నిల్వలు ఇతర ప్రాంతాలకు విక్రయించారనే విమర్శలు వెల్లువెత్తుతున్న తరుణంలో విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఆకస్మిక తనిఖీలు చేయడం చర్చనీయాంశమైంది.

## అంగడి వేలం డబ్బులు చెల్లింపు

హుస్నాబాద్‌టౌన్, మార్చి 18: హుస్నాబాద్ పశువుల అంగడి వేలానికి సంబంధించిన డబ్బులు రూ. 40లక్షలు చెల్లించినట్లు మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్‌గౌడ్ సోమవారం తెలిపారు. ఇటీవల అంగడి కాంట్రాక్టు వేలం నిర్వహించగా కరీంనగర్ జిల్లా గంగాధర్‌కు చెందిన రుద్రాక్ష శ్రీనివాస్ రూ. కోటి 20లక్షల 26వేలకు దక్కించుకున్నారు. ఇందులో భాగంగా సదరు కాంట్రాక్టర్ మున్సిపల్‌కు మూడోవంతు కింద రూ. 40 లక్షలు చెల్లించినట్లు తెలిపారు.

## వృద్ధులకు వాసవి క్లబ్ చేయూత


వృద్ధులకు చద్దర్లు పంపిణీ చేస్తున్న వాసవి క్లబ్ ప్రతినిధులు

సిద్దిపేట టౌన్, మార్చి 18: వృద్ధులకు సహాయం చేయడమే నిజమైన సేవ అని సిద్దిపేట వాసవి క్లబ్ రీజియన్ చైర్మన్ శ్రీనివాస్ అన్నారు. వాసవి, వనిత క్లబ్ ప్రతినిధులు సోమవారం సిద్దిపేట భారత్‌నగర్ వృద్ధాశ్రమంలో 20 మంది వృద్ధులకు చద్దర్లు అందజేశారు. కార్యక్రమంలో వాణి, రేణుక, వీరేశం పాల్గొన్నారు.

## 'బొమ్మ' సేవలు మరువలేనివి


బొమ్మ వెంకటేశ్వర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

హుస్నాబాద్, మార్చి 18: ఇందుర్తి మాజీ ఎమ్మెల్యే బొమ్మ వెంకటేశ్వర్ సేవలు మరువలేనివని పలువురు వక్తలు అన్నారు. సోమవారం హుస్నాబాద్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో బొమ్మ వెంకటేశ్వర్ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి వివిధ పార్టీలు, సంఘాల ఆధ్వర్యంలో పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇందుర్తి ఎమ్మెల్యేగా, న్యాయవాదిగా పేదల పక్షాన నిలిచిన నాయకుడు బొమ్మ వెంకటేశ్వర్ అని కొనియాడారు. సింగిల్‌విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, మాజీ సర్పంచ్ కేడం లింగమూర్తి, స్ఫూర్తి అసోసియేషన్ అధ్యక్షుడు పందిల్ల శంకర్, కౌన్సిలర్లు వల్లపు రాజు, పున్న లావణ్యసది, సరోజన, నాయకులు ఎండీ హసన్, మల్లికార్జున్‌రెడ్డి, కవ్వ వేణుగోపాల్‌రెడ్డి, చొక్కాచారి, సమ్మయ్య పాల్గొన్నారు.


సిద్దిపేటలో ఎగ్జిబిట్లను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

## రోబోటిక్స్ ఎగ్జిబిషన్ అదుర్స్

సిద్దిపేట టౌన్, మార్చి 18: సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం జిల్లా స్థాయి రోబోటిక్స్ ఎగ్జిబిషన్ నిర్వహించారు. ఈ ఎగ్జిబిషన్‌లో 38 ఎగ్జిబిట్లు ప్రదర్శించారు. జిల్లాలోని వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు రూపొందించిన రోబోటిక్స్ మోడల్స్‌ను ప్రదర్శించి అందరినీ ఆకట్టుకున్నారు. ఎన్సాన్‌పల్లి, ఇందిరానగర్, తడ్కపల్లి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు మొదటి మూడు స్థానాల్లో నిలిచారు. వీరికి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రసాద్ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు శ్రీనివాస్, సహదేవ్, సుదర్శనం, అయోధ్యరెడ్డి, మధుసూదన్, భైరయ్య, కృష్ణయ్య, సౌమ్య పాల్గొన్నారు.

### మృతుడి కుటుంబానికి ఎమ్మెల్యే పల్లా అండ

కొమురవెల్లి, మార్చి 18: మండలంలోని లెనిన్‌నగర్ బీఆర్‌ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు దాసరి మచ్చేందర్ తండ్రి యాదయ్య సోమవారం మృతిచెందాడు. స్థానిక నాయకుల ద్వారా విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి బీఆర్‌ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు మచ్చేందర్, మాజీ ఉపసర్పంచ్ దాసరి శ్రీనును ఫోన్‌లో పరామర్శించారు. కార్యకర్తలకు పార్టీ ఎల్లప్పుడు అండగా ఉంటుందని పేర్కొన్నారు. ఏ ఆపద వచ్చినా ఆదుకుంటామని తెలిపారు. జడ్పీటీసీ సిద్ధప్ప ద్వారా రూ.5వేల ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు కిషన్, బాబు, నర్సింహులు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## న్యాయం చేయాలి

సిద్దిపేట టౌన్, మార్చి 18: రోడ్డును ఆక్రమించి నిర్మాణాలు చేస్తున్నవారిపై చర్యలు తీసుకొని తమకు న్యాయం చేయాలని సిద్దిపేట హౌసింగ్ బోర్డుకాలనీవాసులు అధికారులను వేడుకున్నారు. సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో సోమవారం వారు మీడియాతో మాట్లాడారు. తమ కాలనీలో బాబూజగ్జీవన్‌రామ్ భవన్ వద్ద ప్రభుత్వం స్థలం ఇచ్చిందని, తాము ఇండ్లు నిర్మించుకొని నివాసం ఉంటున్నామన్నారు. అయితే కొందరు రోడ్డును ఆక్రమించి బెదిరించారని ఆరోపించారు.

## మండల పరిషత్ ఉద్యోగుల నిరసన

బెజ్జంకి, మార్చి 18: నాగర్‌కర్నూల్ జిల్లా కోడేరు మండలంలోని ఎంపీవోపై దాడికి నిరసనగా మండల పరిషత్ కార్యాలయం ఎదుట ఎంపీడీవో లక్ష్మప్ప, ఎంపీవో విష్ణు, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. దాడికి పాల్పడిన వ్యక్తిని కఠినంగా శిక్షించాలని వారు డిమాండ్ చేశారు.


నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

## కోఎడ్యుకేషన్ తరగతుల పునరుద్ధరణ


ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న అధ్యాపకులు

గజ్వేల్, మార్చి 18: గజ్వేల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల బాలుర సముదాయంలో కోఎడ్యుకేషన్‌ను తిరిగి పునరుద్ధరించడం జరుగుతుందని, వచ్చే విద్యా సంవత్సరం నుంచి బాలురు, బాలికల నుంచి అడ్మిషన్లు స్వీకరిస్తామని ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. సోమవారం డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 1997లో కోఎడ్యుకేషన్‌తో ప్రారంభమైన డిగ్రీ కళాశాల 2018లో బాలుర, బాలికల కళాశాలలుగా విడిపోయాయన్నారు. వచ్చే విద్యాసంవత్సరం నుంచి కళాశాలలో కోఎడ్యుకేషన్ తరగతులు ప్రారంభించేందుకు అనుమతి ఇచ్చిన కమిషన్ బుర్ర వెంకటేశానికి కళాశాల అధ్యాపక బృందం, విద్యార్థుల తరుపున ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

## పని ప్రదేశంలో వసతులు కల్పించాలి

మద్దూరు(ధూళిమిట్ట), మార్చి 18: ఉపాధి హామీ పథకంలో భాగంగా పనిచేస్తున్న కూలీలకు పని ప్రదేశంలో వసతులు కల్పించాలని ఎంపీడీవో రామ్మోహన్ అన్నారు. సోమవారం ధూళిమిట్టలో జరుగుతున్న ఫాంపాండ్ పనులను ఆయన పరిశీలించారు. ఎండలు అధికంగా ఉండడం వల్ల పనిప్రదేశంలో ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు, తాగునీరు, నీడ కల్పించాలని ఆయన ఆదేశించారు. ఎంపీవో ఖాజా మోహినుద్దీన్, పంచాయతీ కార్యదర్శి రాజు, ఎఫ్ఏ బాలకిషన్ పాల్గొన్నారు.

## గొర్రెల యూనిట్లు మంజూరు చేయాలి

నంగునూరు, మార్చి 18: గత బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో డీడీలు చెల్లించామని తమకు గొర్రెల యూనిట్లు మంజూరు చేయాలని కోరుతూ సోమవారం కలెక్టర్ మను చౌదరికి మండలంలోని అక్కెనపల్లి మధిర గ్రామం ఆరెపల్లి గొల్లకుర్మలు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..గత ప్రభుత్వంలో తాము 22 యూనిట్లకు ఒక్కో యూనిట్‌కు రూ.43,750 చొప్పున మొత్తం రూ.9,62,500 కలెక్టర్ పేరిట డీడీ తీశామన్నారు. ప్రస్తుత ప్రభుత్వం స్పందించి తమకు గొర్రెల యూనిట్లు మంజూరు చేయాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గొల్ల కుర్మ సంఘం సభ్యులు యాదగిరి, అయిలయ్య, రామకృష్ణ, నాగరాజు, నర్సింహులు, మహేందర్, నరేశ్ పాల్గొన్నారు.


కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఆరెపల్లి గ్రామ గొల్లకుర్మలు

## కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

చేర్యాల, మార్చి 18: అంగన్‌వాడీ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ఐసీడీఎస్ చేర్యాల ప్రాజెక్టు సీడీపీవో శారద కోరారు. సోమవారం పట్టణంలోని కురుమవాడ అంగన్‌వాడీ కేంద్రంలో మున్సిపాలిటీ పరిధిలోని అంగన్‌వాడీలు,ప్రాజెక్టు అధికారులు, సిబ్బందితో పోషణ్ పక్వాడ పక్షోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీవో మాట్లాడుతూ గర్భిణులు పౌష్టికాహారం తీసుకుంటే పుట్టే బిడ్డలు ఆరోగ్యంగా ఉంటారన్నారు. అనంతరం చిరుధాన్యాలపై తల్లులు, కిశోర బాలికలు, వృద్ధులకు అవగాహన కల్పించడంతో పాటు పోషణ్ ప్రతిజ్ఞ చేయించారు. పోషణ్ అభియాన్ కోఆర్డినేటర్ కనకరాజు, టీచర్లు కృష్ణవేణి, వీరమణి, స్వరూప, రేణుక, శోభ, బాలవ్వ, రేణుక, స్వరూప, బాలామణి, హైమావతి, జ్యోతి పాల్గొన్నారు.



చేర్యాల: పోషణ్ పక్వాడ పక్షోత్సవంలో మాట్లాడుతున్న సీడీపీవో శారద

**కిష్టంపేటలో...**

కొమురవెల్లి, మార్చి 18: అంగన్‌వాడీ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ పావని అన్నారు. సోమవారం కిష్టంపేటలో పోషణ్ పక్వాడ కార్యక్రమం నిర్వహించారు. టీచర్లు, రేణుక, అరుణ, ఉపాధ్యాయులు, ఆశ కార్యకర్తలు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

**మద్దూరులో...**

మద్దూరు(ధూళిమిట్ట), మార్చి 18: చిరుధాన్యాలతోనే పౌష్టికాహారం అందుతుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పుష్పలత అన్నారు. సోమవారం మద్దూరులోని అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ్ పక్షోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎం జ్యోతికుమారి, సీఏ జెబతబస్సుం, ఆశ కార్యకర్త ఎల్లమ్మ, అంగన్‌వాడీ టీచర్లు యాకమ్మ, దుర్గలత, భాగ్యమ్మ, మౌనిక పాల్గొన్నారు.

## చైన్ స్నాచింగ్ కేసులో నిందితుడి అరెస్ట్

దుబ్బాక, మార్చి 18: మహిళ నుంచి బంగారు గొలుసు దొంగిలించిన నిందితుడిని దుబ్బాక పోలీసులు పట్టుకుని రిమాండ్‌కు తరలించారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను సోమవారం దుబ్బాక సీఐ శ్రీనివాస్ విలేకరులకు వెల్లడించారు. ఈనెల 14న దుబ్బాక సర్కిల్ భూంపల్లి పీఎస్ పరిధిలో ఎనగుర్తి గ్రామ శివారులో ఎల్లమ్మ దేవాలయం వద్ద కల్లు అమ్ముకుంటున్న కోయాడ యాదమ్మ వద్దకు కల్లు తాగేందుకు రాజన్న సిరిసిల్ల జిల్లాలోని ముస్తాబాద్‌కు చెందిన మ్యాన లావణకుమార్ వచ్చాడు. యాదమ్మ ఒంటరిగా ఉండటంతో అతడు పథకం ప్రకారం ఆమె నుంచి రెండున్నర తులాల బంగారు గొలుసును గుంజుకుని బైక్‌పై పరారయ్యాడు. ఈ విషయంపై భూంపల్లి పీఎస్‌లో బాధితురాలు ఫిర్యాదు చేసింది. సిద్దిపేట సీపీ అనురాధ పర్యవేక్షణ, దుబ్బాక సీఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ప్రత్యేక టీంలు ఏర్పాటు చేసి నిందితుడిని సోమవారం పట్టుకుని రిమాండ్‌కు తరలించారు. ఈ కేసును ఛేదించిన దుబ్బాక, మిరుదొడ్డి ఎస్సైలు గంగరాజు, పరశురామ్, క్రైం పార్టీ సిబ్బంది సాయికృష్ణ, రాజిరెడ్డి, రాంజీలను ఆయన ప్రత్యేకంగా అభినందించారు.


వివరాలు వెల్లడిస్తున్న దుబ్బాక సీఐ శ్రీనివాస్

**ప్రకటన**

ఇందుమూలముగా సమస్త ప్రజలకు తెలియపరచటం ఏమనగా నా క్లయింట్ శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, వేములవాడ శాఖ గారు. శ్రీ వల్లంపట్ల తిరుపతి, S/o రాజయ్య, R/o. అనంతగిరి గ్రామం, ఇల్లంతకుంట మండలం, సిరిసిల్ల జిల్లా గారికి వ్యాపార నిమిత్తం ఋణ సదుపాయం కల్పించుచున్నారు. ఇట్టి విషయములో తన యొక్క స్వంత ఆస్తి అయిన ఖాళీ స్థలం దీని యొక్క ప్లాట్ నెంబర్:45 లోని కొంత భాగం దీని యొక్క విస్తీర్ణం: 184.63 చ.గజాలు దీని యొక్క సర్వే నెంబరులు, 601,602, 604 బెజ్జంకి గ్రామం మరియు మండలం సిద్దిపేట జిల్లా లో గల దానిని నా క్లయింట్‌కు పై ఋణ విషయములో తనఖాగా పెట్టి పై ఆస్తికి సంబంధించిన ఒరిజినల్ దస్తావేజులు అప్పగించినారు. కావున ఇట్టి ఆస్తిపై ఎవరికైనా ఎలాంటి హక్కులు కానీ ఆక్షేపనలు కానీ వ్యాజములు ఉన్నచో ఈ ప్రకటన వెలువడిన 7 దినముల లోగా తగు దస్తావేజులతో నా కార్యాలయమునకు వచ్చి సంప్రదించగలరు. లేనిచో ఎవరికి అభ్యంతరాలు లేవని ధృవీకరించబడును.

తేది: 18-03-2024 స్థలము: సిరిసిల్ల.

ఇట్లు: Sd/- సి.హెచ్. మహేశ్ గౌడ్
న్యాయవాది బి.ఎస్‌సి., ఎల్.ఎల్.బి.,
సిద్దర్థనగర్, సిరిసిల్ల, జి|| రాజన్న సిరిసిల్ల.

**బహిరంగ ప్రకటన**

ఇందుమూలంగా సమస్త ప్రజలకు తెలియజేయునది ఏమనగా పోగుల కవిత W/o. ఆంజనేయులు R/o. శివనగర్, కరీంనగర్ గారు మార్టిగేజ్ లోను నిమిత్తము సిద్దిపేట జిల్లాలోని హుస్నాబాద్‌లో సర్వేనెం. 241/A, విస్తీర్ణం: 121 చ.గ.లలో నిర్మితమైన RCC గృహము నెం. 11-55/14/1 గల దానిని "INCRED FINANCIAL SERVICES LTD" కరీంనగర్ బ్రాంచ్ గారికి తనఖా పెట్టుటకు దరఖాస్తు సమర్పించియున్నారు. లోగడ పోగుల కవిత గారు ఇట్టి ఇంటిని గుంటిపెల్లి ఆంజనేయులు S/o. దుర్గేశం R/o. టీచర్స్ కాలనీ, హుస్నాబాద్ జిల్లా సిద్దిపేట గారి నుండి రిజిష్టర్డ్ విక్రయ దస్తావేజు నెం. 3779/2022 ద్వారా ఖరీదు చేసినారు. ఇట్టి డాక్యుమెంటు యొక్క ఒరిజినల్ లింకు డాక్యుమెంట్లు రిజిష్టర్డ్ సేల్‌డీడ్ నెం. 1105/2000 మరియు రిజిష్టర్డ్ మార్టిగేజ్ డీడ్ నెం. 1347/2014 పోయినవని పోగుల కవిత గారు తెలిపినారు. కావున ఇట్టి డాక్యుమెంట్ల పై గాని లేదా పై ప్రాపర్టీ పై గాని ఎవరికైనా అభ్యంతరాలు ఉన్న యెడల వ్రాత పూర్వక ఆధారాలతో (7) రోజులలో క్రింది చిరునామాలో గల వారికి తెలుపగలరు. లేని యెడల ఎలాంటి అభ్యంతరాలు లేవని భావించి సదరు లోను మంజూరు విషయంలో "INCRED FINANCIAL SERVICES LTD" కరీంనగర్ బ్రాంచ్ వారు ప్రొసీడుకాగలరు.

ఇట్లు: సాన చంద్రమోహన్
అడ్వకేట్ (TS/138/1995) ప్లాట్ నెం.303,
శ్రీసాయి ఎవెన్యూ ముకరంపుర, కరీంనగర్.
సెల్ :9666077777, 9141499999